క్లుప్తంగా

సచివాలయ సిబ్బందికి సత్కారం



సచివాలయ సిబ్బందిని సత్కరిస్తున్న సర్పంచ్ శ్రీలత తదితరులు

కిర్లంపూడి: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు అపూర్వ గౌరవం దక్కుతుందని సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అన్నారు. జగపతినగరం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఇటీవల బదిలీ అయిన సచివాలయ సిబ్బందిని సత్కరించారు. గ్రామ సచివాలయాలకు చెందిన సుమారు 25 మంది సచివాలయ ఉద్యోగులను సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, రాంబాబు శాలువా, పూలమాలలతో సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చిన సచివాలయ సిబ్బందికి స్వాగతం పలికారు. కిర్లంపూడి సొసైటీ చైర్మన్ వర్ర చినబాబు, కాళ్ల వెంకటేశ్, సెక్రటరీ రమేష్‌బాబు, ఎంపీడీఓ హరిప్రసాద్ పాల్గొన్నారు.

సుబ్బయ్యమ్మపేటలో తాగునీటి ఎద్దడి



సుబ్బయ్యమ్మపేటలో జీఎల్ఎస్ ట్యాంక్ వద్ద తాగునీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

గండేపల్లి: మండలంలోని సుబ్బయ్యమ్మపేటలో తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలోని రెండు వాటర్ ట్యాంక్‌ల మోటార్లు పనిచేయకపోవడంతో ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామ శివారున ఉన్న మోటారు మరమ్మతులకు గురికాగ, వినాయకుడి ఆలయం వద్ద గల మోటార్‌కు కరెంట్ సరఫరా చేసే విద్యుత్ తీగలు తెగిపోవడంతో గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకూ గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. మోటార్ స్విచ్లను మల్లేపల్లి నుంచి తాగునీటిని తెప్పుకున్నారు. కాగా గ్రామంలో గురువారం రాకపోకలు సాగించిన లారీలు, భారీ వాహనాలు మోటార్‌కు కరెంట్ సరఫరా చేసే తీగలతో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లను లాగేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు ఆదాయం

గండేపల్లి: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని మురారి వెంకటేశ్వర కాకతీయ కల్యాణ మండపంలో శుక్రవారం ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ఇక్కడి పొలాలు అనుకూలంగా ఉంటాయన్నారు. రైతులకు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీటీ అబ్బిరెడ్డి దొరబాబు, వైస్ ఎంపీపీ బండి రాజా, మాజీ వైస్ ఎంపీపీలు మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, ఉద్యాన అధికారి ఎ.శ్రీవల్లి, ఎంపీడీఓ కె.సంధ్యారాణి, ఎంఆర్ఓ శ్రీనివాస్, ఏఓ శ్రీరామ్ పాల్గొన్నారు.

సృజనాత్మకతకు వర్క్‌షాపులు దోహదం

గండేపల్లి: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు వర్క్‌షాపులు దోహదం చేస్తాయని ఆదిత్య విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ అన్నారు. సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన అప్లైడ్ రోబోటిక్స్, బ్యాటిల్ బాట్ ఎడిషన్ వర్క్‌షాపు శుక్రవారంతో ముగిసింది. విద్యార్థులకు రోబోటిక్స్, రోబో నిర్మాణ సాంకేతికతలపై అవగాహన కల్పించినట్టు తెలిపారు.

పోరాటాలే రాజారావుకు నిజమైన నివాళి



జగ్గంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అరుణోదయ కళాకారులు

జగ్గంపేట: ప్రజా సమస్యలు, రైతు కూలీల సమస్యలపై పోరాటాలు చేయడమే కామ్రేడ్ సాంబటి రాజారావుకు ఇచ్చే నిజమైన నివాళి అని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక స్థానిక భవనంలో శుక్రవారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎ.చిట్టిబాబు అధ్యక్షతన రాజారావు వర్ధంతి సభ నిర్వహించారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర నేతగా రాజారావు త్యాగాలను కొనియాడారు. రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో అరుణోదయ కళాకారులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ కమిటీ సభ్యుడు ఎస్.లక్ష్మి, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు పి.విజయ తదితరులు పాల్గొన్నారు.

బాబుకు వంచన వెన్నతో పెట్టిన విద్య

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా
- కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపు
- తునిలో పార్టీ పట్టణ విస్తృత స్థాయి సమావేశం



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న దాడిశెట్టి రాజా

తుని: అధికారం కోసం అడ్డగా సాధ్యం కాని హామీలను ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసగించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. పార్టీ శ్రేణులు ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలని దిశా నిర్దేశం చేశారు. స్థానిక రెడ్ కన్వెన్షన్ వీధిలోని మర్కంట్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీపై వైఎస్సార్ సీపీ తుని పట్టణ విస్తృత స్థాయి సమావేశం పార్టీ రాష్ట్ర మున్సిపల్ వింగ్ కార్యదర్శి రేలంగి రమణాగౌడ్ అధ్యక్షతన జరిగింది. దాడిశెట్టి రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. పార్టీ శ్రేణులు ఉత్సాహంతో కేరింతలు కొట్టి జై రాజా, జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమితం అయితే వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ప్రాణాలను లెక్క చేయకుండా ధైర్యంగా సేవలు అందించారన్నారు. కరోనా నియంత్రణకు ఉపయోగించే రెమిడెసివర్ ఇంజక్షన్లు వేల సంఖ్యలో తీసుకువచ్చి ప్రజలకు ఉచితంగా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రెండేళ్ల పాటు ఉచితంగా భోజనం అందించి ఆదుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు పాలన, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనను బేరీజు వేసుకొని ఎవరి వల్ల ప్రయోజనం కలిగిందో ప్రజల ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.

తుని పట్టణంలో 110 సీసీ రోడ్లు వేశాం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తుని పట్టణంలో 110 సీసీ రోడ్లు, ప్రజలకు పుష్కలంగా తాగునీరు అందించామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో రాజీ పడలేదన్నారు. వ్యాపారులు స్వేచ్ఛగా ఉంటేవారని, పోలీసు కేసులు లేకుండా అందరూ ఆనందంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక విషయంలో ఏనాటో పాటు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఏలూరి సుధారాణి, పలువురు నాయకులపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టారన్నారు. టీడీపీకి ఒక్క కౌన్సిలర్ లేక పోయినా కౌన్సిలర్లను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేయడం దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జన బలం, పేరు కలిగిన నాయకులను ఎంపిక చేయాలని సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు సూచించారు. కార్యక్రమంలో పార్టీ తుని పట్టణ శాఖ అధ్యక్షుడు మార్పిడు శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు చింతల సునీత, పార్టీ సీనియర్ నాయకుడు కలిదిండి సత్యనారాయణరాజు, రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సాపిరెడ్డి చంద్రరావు, రాష్ట్ర క్రిస్టియన్ విభాగం కార్యదర్శి నక్కా జాన్ ఆనంద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చక్కా రమేష్, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి కుక్కపు కృష్ణారావు, జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు కనిగిరి వెంకట రమణ, జిల్లా కార్యదర్శి పెంటకోట సురేష్, తుని పట్టణ యూత్ అధ్యక్షుడు మద్దాలు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రి జగదీష్, తుని నియోజకవర్గ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు కాసే కపిల్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు సుర్ల శ్రీను, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సలీం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

250 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు



తునిలో విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రమేష్

తుని రూరల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అంధత్వానికి దూరంగా ఉండొచ్చని కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రమేష్ అన్నారు. తుని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ డాక్టర్ పోడ్సన్ రామ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు అంధత్వ నివారణ, బాలబాలికల్లో మందగించే కంటిచూపు, రోజువారీగా తీసుకోవలసిన ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. ప్రోటీన్లు కలిగిన ఆహారం, ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు ఆహారంలో తీసుకోవాలన్నారు. 250 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 45 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని ఎంపీడీఓ కె.సాయినవీన్ తెలిపారు. వీరందరికి కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ జి.వరదయ్య, కిరణ్ కంటి ఆస్పత్రి సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు



గిడజాంలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు



కిర్లంపూడి నూకాలమ్మ ఆలయంలో కొబ్బరి కాయలు కొడుతున్న ముద్రగడ అభిమానులు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సభ్యుడు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగు పడాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు, అభిమానులు ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు స్థానిక నూకాలమ్మ ఆలయంలో 1111 కొబ్బరికాయలు కొట్టి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చిల్లంగి చింతలపాటిలో వేంచేసిన కనక దుర్గమ్మ, వైఎస్సార్ రాష్ట్ర మాజీ బిసి సెల్ వినియోగించి పూజలు చేశారు. కిర్లంపూడి గ్రామ శివారున వేంచేసిన వనదుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముద్రగడ పద్మనాభం సేవీమతి పద్మావతి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు.

ముద్రగడ ఆరోగ్యం కుదుటపడాలని ప్రార్థనలు

రౌతులపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం కుదుటపడాలని కోరుతూ మండలంలోని గిడజాం పాస్టర్లు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్స్ ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షుడు బందారు భైరాగి ఆధ్వర్యంలో పలు గ్రామాల పాస్టర్లు ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకోవాలని కోరుతూ ఏసు క్రీస్తుకు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పలువురు దైవ సేవకులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగు పడాలని కోరుతూ కిర్లంపూడి మసీదులు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఇంటర్‌లో సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

తుని రూరల్: ఇంటర్మీడియెట్ మొదట సంవత్సరం ఎంఈసీ గ్రూపులో సీట్లు భర్తీకి స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు వి.కొత్తూరు సాంఘిక సంక్షేమశాఖ (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం) బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.ప్రసన్నరాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న 23 సీట్లను రిజర్వేషన్ల వారీగా భర్తీ చేస్తామన్నారు. ఎస్సీ–1లో రెండు, ఎస్సీ–2లో ఏడు, ఎస్సీ–3లో ఏడు, బీసీ రెండు, బీసీ–సీలో ఐదు మొత్తం 23 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యార్థినులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలను కళాశాలలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 97045 51118 నంబరును సంప్రదించాలని సూచించారు.

మంచి నడవడిక కోసం బైండోవర్

గండేపల్లి: మంచి నడవడిక కోసం పలువురిని బైండోవర్ చేసినట్లు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. గండేపల్లిలో తరచూ గొడవలు పడుతున్న ఆరుగురు, అనుమానంతో భార్యను వేధిస్తున్న వ్యక్తి, నాయకుడుపల్లి, కోటపాడు మార్గంలో వ్యభిచారానికి ప్రోత్సహిస్తున్న వ్యక్తిని, మహిళను మెజిస్ట్రేట్ ఎదుట సూరంపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిని, గంజాయి కేసులో పాత ముద్దాయిలను మండల మెజిస్ట్రేట్ వద్ద శుక్రవారం హాజరు పరిచామన్నారు. వీరిని మంచి ప్రవర్తన కోసం బైండోవర్ చేసినట్టు వివరించారు.

కనీస వేతనం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ పద్మ

కోటనందూరు: పంచాయతీ కార్మికులు (గ్రీన్ అంబాసిడర్లు)కు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ పద్మ డిమాండ్ చేశారు. స్థానిక నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో గ్రీన్ అంబాసిడర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు 5వ తేదీ లోపే జీతాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదబీమా కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, గ్లౌజులు, సబ్బులు, శానిటేషన్ మెటీరియల్ ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి ముసలయ్య, కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

తొండంగి: మండలంలోని గోపాలపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. బెండపూడి, తమ్మయ్యపేట గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గృహ, వ్యవసాయ, పారిశ్రామిక వినియోగదారులు సహకరించాలని కోరారు.

డివిజన్‌లో 80 శాతం పన్నుల వసూలు



ప్రత్తిపాడులో స్వర్ణ పంచాయతీ ఆన్‌లైన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ బాలామణి

ప్రత్తిపాడు: పెద్దాపురం డివిజన్‌లో 80 శాతం పన్నులు వసూలు చేసినట్టు పెద్దాపురం డివిజనల్ పంచాయతీ అధికారి బాలమణి తెలిపారు. ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న స్వర్ణ పంచాయతీ ఆన్‌లైన్ కార్యక్రమాలను శుక్రవారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని 213 గ్రామ పంచాయతీల్లో రూ.20,02,22,865 పన్నుల వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.17,52,23,769 వసూలు చేసినట్టు చెప్పారు. గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా మిగిలిన రూ.4,55,09,162 బకాయిలను వసూలు చేస్తామన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను డిమాండ్ నోటీసుల్లో తప్పులను సరిదేయడం, ఎస్సెస్మెంట్‌లలో నంబర్లను సరిచేసే ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 31 వరకూ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

2,779 బంగారు కుటుంబాల దత్తత



బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమాన్ని సమీక్షిస్తున్న డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో ఇప్పటివరకూ 2,779 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నామని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా సర్వే నిర్వహించి ప్రత్తిపాడు మండలంలో 4,914 కుటుంబాలు, ఏలేశ్వరం నగర పంచాయతీలో 1,248, ఏలేశ్వరం మండలంలో 2,594, శంఖవరం మండలంలో 2,676, రౌతులపూడి మండలంలో 3,342 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. వీరిని దత్తత తీసుకునే మార్గదర్శులు 647 మందిని ఎంపిక చేశామన్నారు. నియోజకవర్గంలో బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎస్ఆర్ కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడి లేని జీవితం



పురుణానందస్వామీజీని సత్కరిస్తున్న శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్

తుని: ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడి లేని జీవితాన్ని పొందవచ్చని యోగద సత్సంగ్ సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు స్వామి స్మరణానందగిరి అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యానికేతన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకాగ్రత పెంపొందించుకోవడానికి, లక్ష్యాన్ని సాధించడానికి యోగా చక్కని మార్గమన్నారు. యోగా, ధ్యానం ద్వారా మనసులో ఉన్న భయాలు తొలగిపోతాయన్నారు. విద్యార్థులు వివేకానంద పతంజలిని పెంపొందించుకోవడానికి పుస్తక పఠనం చేయాలని సూచించారు. అనంతరం స్మరణానందస్వామీజీని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ సత్కరించారు. కార్యక్రమంలో యోగద సత్సంగ్ ధ్యాన మండలి సభ్యులు పాల్గొన్నారు.

భజన కళాకారుడికి సన్మానం



రౌతుపాలెం భజన కళాకారుడు అమ్మన్నను సన్మానిస్తున్న గ్రామస్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రౌతులపాలెంలో భజన కళాకారుడు సత్యంశెట్టి అమ్మన్నను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఏలూరు గ్రామానికి చెందిన అమ్మన్న శ్రీకృష్ణానంద బాల భక్త భజన సమాజం ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా మందిరంలో భజనలు, కీర్తనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ చేతుల మీదుగా అమ్మన్నను పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో దర్భూడి శేషు, గోళ్ల తేజ, కరుణాల శేఖర్, సత్యంశెట్టి సాయి చరణ్, కోలా వెంకటేశ్వరావు, బుర్రె బుల్లికాపు, చీకట్ల తాతీలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



వేలంగిలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు సందీప్

శంఖవరం: డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయని ఏ.మల్లవరం పీహెచ్‌సీ వైద్యుడు సందీప్ తెలిపారు. మండలంలోని వేలంగిలో ప్రజలకు శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయన్నారు. ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూటే కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదన్నారు. లక్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంలో జగ్గంపేటకు ప్రథమస్థానం



గండేపల్లి ఎస్సై శివనాగబాబు, జగ్గంపేట ఎస్సై రఘునాథరావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్ (ఎడమ నుంచి కుడికి)

జగ్గంపేట: కేసుల పరిష్కారంలో జిల్లాలో జగ్గంపేట పోలీసు స్టేషన్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జగ్గంపేట ఎస్సై రఘునాథరావును జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు. కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎస్సైకు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ నెల 5న నిర్వహించిన మెగా జాతీయ లోక్ అదాలత్‌లో జగ్గంపేట పోలీసుస్టేషన్ పరిధిలో 116 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ కేసుల పరిష్కారంలో ఎస్సై రఘునాథరావు చేసిన కృషిని ఉన్నతాధికారులు అభినందించారు.

ఎస్సై శివనాగబాబుకు అభినందనలు

గండేపల్లి: స్థానిక ఎస్సై శివనాగబాబును జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు. గండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని 116 కేసుల్లో కక్షిదారులు, ఫిర్యాదు దారులను సమన్వయం చేసి ఈ నెల 5న నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆయా కేసులు పరిష్కరించడంలో ఎస్సై శివనాగబాబు చొరవ చూపారు. ఈ మేరకు శుక్రవారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ బిందుమాధవ్ ఎస్సైను అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు.

ఏలేరు ఆయకట్టుకు సాగు నీరు



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు నెహ్రూ, సత్యప్రభ తదితరులు

జగ్గంపేట: ఏలేరు, తిమ్మరాజు చెరువు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడమే లక్ష్యమని, దీని కోసమే ఏలేరులోకి గోదావరి జలాలు మళ్లించే పురుషోత్తపట్నం స్టేజ్–2 ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. మండలంలోని రామవరం వద్ద పురుషోత్తపట్నం స్టేజ్ 2 ఎత్తిపోతల పథకాన్ని శుక్రవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ, జనసేన పిఠాపురం ఇన్‌చార్జ్ ఎం.శ్రీనివాసరావు, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఏలేరు రిజర్వాయర్‌లో కేవలం 10 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందన్నారు. ఏలేరు ఆయకట్టులో పంటల సాగుకు 12 టీఎంసీలు అవసరమని, దీంతో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఏలేరు రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు పంపు చేసే కార్యక్రమాన్ని ముందుగానే ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌డీఏ కూటమి నాయకులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

శ్రావణం.. శుభప్రదం

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



తునిలో గాజుల అలంకరణలో వరమహాలక్ష్మి అమ్మవారు

ఏలేశ్వరం: శ్రావణమాసం ప్రారంభం కావడంతో శుక్రవారం నియోజకవర్గవ్యాప్తంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల వద్ద మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఈ ఏడాది శ్రావణ మాసంలో ఐదు శుక్రవారాలు రావడంతో ప్రత్యేక సంతరించుకుంది. పట్టణంలోని తోటవీధి, ఆర్టీసీ కాంప్లెక్స్, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల్లోని దుర్గాదేవి ఆలయాల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని పలువురు శుభ కార్యక్రమాలను ప్రారంభించారు.

రౌతులపూడి: శ్రావణ మాసం ప్రారంభం కావడంతో శుక్రవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శుభప్రదమైన శ్రావణ మాసంలో తొలిశుక్రవారం కావడంతో తెల్లవారుజామున భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలకు క్యూ కట్టారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రౌతులపూడి సినిమా సెంటర్‌లో వేంచేసిన కనకదుర్గమ్మ ఆలయంలో మండి తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మి పూజలు కుంకుమార్చనలు చేశారు.

ప్రత్తిపాడు రూరల్: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి, ఉత్తరకంచి, పెద్దిపాలెం, శరభవరం, రాచపల్లి తదితర గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. రాచపల్లి ఆదిబాలేశ్వర స్వామి ఆలయంలో అపర కుబేరుడు అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

గాజుల అలంకరణలో వర మహాలక్ష్మి అమ్మవారు

తుని: స్థానిక చిట్టూరి మెట్టలో వేంచేసిన వరమహాలక్ష్మి అమ్మవారు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గాజులతో అలంకరించారు. తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారని శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి, ఆలయ ట్రస్ట్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి చేశారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు వేదుల సూర్యనారాయణ, దత్తాత్రేయ శర్మ, చిట్టెం వాసు, వేమ, చెల్లపిళ్ల ప్రసాద్, దేవులపల్లి ప్రకాష్ తదితరులు హోమం నిర్వహించారు. 30 మంది భక్తులు రూ.750 టికెట్‌తో హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి పరిచారకుడు ప్రసాద్ ఆధ్వర్యంలో పండితులు కుంకుమపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా

కిర్లంపూడి: షాపుల యజమానులు నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే జరిమానా తప్పదని ఎంపీడీఓ ఎం.గోవిందు హెచ్చరించారు. గోనెపాడులోని షాపులను శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం షాపు యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ స్ట్రాలు, ప్లేట్లు, గ్లాసులు వాడితే రోజుకు రూ.25 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి బి.శిరీష, సచివాలయ సిబ్బంది ఉన్నారు.